“షట్కర్మయుక్తా”

“ఏంచేస్తున్నావ్?”
“ఏం చెయ్యమన్నార్?”
“సున్నం కావాలి?”
“తెచ్చుకోవాలి”
“నువ్వెందుకు తేవూ?”
“మీ రెందుకు తెచ్చుకోరూ?”
“ఎక్కడో వుంటే——”
“ఎక్కడో యేమిటి, సందులో కుండలో వుంటే?”
“నాకా సంగతి తెలుసు, నువ్వు తేవాలి”
“నాకూ తెలుసు ఈసంగతి, మీరు తెచ్చుకోవాలి”

"తెచ్చిపెట్టమని చెబుతున్నాను వినపడదూ?"

"మడి కట్టుకున్నాను కనపడదూ?"

"మడి కట్టుకుని యిప్పుడేమి చెయ్యాలీ నువ్వు"

"మీరలా కూచుని మాత్రం యేమి చెయ్యాలండీ మహా?"

"కారణం చెబితేనే మైలపడిపోతావా?"

"చెబితే మీకేమయినా కలిసివస్తుందా?"

"అయినా చెబుదూ చూద్దాం"

"పనిమనిషికి అంట్లు పడెయ్యాలి"

"పడేసి?"

"పొయ్యి అలకాలి"

"అలికి?"

"ముగ్గు—"

"పెట్టి?"

"సడే, నిప్పు పడెయ్యాలి"

"పడేసి?"

"ఎసరు—"

"పెట్టి?"

"కుంభం పుడకెయ్యాలి కాదూ? ఏది తప్పినా అది తప్పదాయె మనకి. మూడు పూట్లా ఆరగింపయితే గాని తిరువీధులు వేంచెయ్యడానికి స్వామికి శక్తి పుట్టుకురాదుగా?"

". . . . . . ."

". . . . . . ."

"ఇట్టే సున్నం తెచ్చేదాని కంత దండకం విడెయ్యడం యెందుకూ?"

"ఒక్క అడుగు సందులోకి లేస్తే కావలసినంత సున్నం కదా, మీరంత రాయసం చూపించుకోడం యెందుకూ?"

"..............."

"పనిమనిషి కనిపెట్టు క్కూచుంది, నేను వెడుతున్నాను మరి"

". . . . . . ."

"పొద్దెక్కిపోతోంది మీ కేం చెబుతారు కబుర్లు. సున్నం కావడమో అక్కర్లేకపోవడమో తేల్చుకుంటే తలుపు వేసుకోవాలి నేను"

"ఇంకా బారెడుపొద్దయినా యెక్కలేదు గదా, అప్పుడే మడేం నీకూ?"

"ఇంకా మొగ మయినా కడుక్కోలేదు గదా, అప్పుడే సున్న మేం మీకూ?"

"నా సున్నాని కీవేళ కొత్తా?"

"నామడికి మాత్రం కొత్తా?"

"..............."

"తొరగా తెమల్చాలి, రెప్పవెయ్యకుండా చూస్తూ కూచుంటే కాదు, జైనవిగ్రహం లాగ"

"పెంకి జవాబులు చెబితే అవుతుందా యేమిటి, సున్నం పట్టుకురా ముందు, ఓహో—!"

"కాళ్ళదగ్గిరికి తెప్పించుకుందా మంటే మాత్రం సాగుతుందా యేమిటి అన్నింటికీ, వెళ్ళి తెచ్చుకోండి సున్నం, ఆ—హా!"

"బాగుంది!"

"మోరకలిగా వుంది"

"సరే, అలా నుంచో"

"మంచిదే, అలా కూచోండి"

"....వెడతావు కాదూ, సున్నం తేవూ?"

"....కూచుంటారు కాదూ, సున్నం తెచ్చుకోరూ?"

"........... ...."

"...................."

"ఇదిగో చూడూ, తీరా కూచున్నాను"

"ఇదిగో పరకాయించండి, తీరా తెచ్చుకోమన్నాను"

"చెప్పిన మాట వినవు కాదూ?"

"వినే మాట చెప్పరు కాదూ?"

"....చెబ్తాను, వెళ్ళు"

"....చూస్తాను, కూచోండి"

"నా పని లేకపోతే—"

"నా అవసరం రాకపోతే"

"ఆడజన్మ యెత్తాక యింత కొయ్యతనం కూడదు"

"మొగజన్మ యెత్తాక యింత సోమరితనం చెల్లదు"

". . . . . . ."

". . . . ."

"నామాట విను. ఇవాళ మాత్రం తెచ్చి పెట్టు"

"నేను చెప్పింది గ్రహించుకోండి ఇప్పటికిమట్టుకు తెచ్చుకోండి"

"అంతే?"

"ఇంతే?"

"........చూతాం"

"సావకాశంగా చూసుకోండి"

"ఆ, ఆ,—ప్చ్! వెళ్ళిపోయింది. దీనిచేత సున్నం తెప్పించ లేక పోయాం మనం........మొదట గారాం చేశాం, అది యివాళ విషమించింది. ఆ పెంకితనం చూస్తే వొళ్ళు మండి పోతూనే వుంటుంది; కాని ఆజవాబులమీద చెయ్యాడకుండావుంది ....పైమాటే తోచకుండానూ వుంది, దాని మొగం యీడ్చా!....మరేం లేదు, ఎంతమందీ వుండినా అదే వరస, అంచేత చాలా యిదిగా వుంటోంది మనకి....హు! మొదటే మనం తెచ్చుకుని వుంటే యీపాటికి మాలపిల్లి దాటి వుందుం. పోనీ యిప్పుడయినా తెచ్చుకుందా మంటే తలుపులు బిడాంచుకుంది కదా? ఎవళ్ళ నయినా దేవురించాలి యిక........తెల్లవారుతూనే సున్నం ముష్టెత్తడం—చిక్కే! కాని తప్పదు"

2

"ఒకమా టింటోకి రావాలి"

". . . . . . ."

"మిమ్మల్నే"

". . . . . . ."

"వినపడదూ?"

". . . . . . ."

"పోనీ, కనపడదుటండీ?"

". . . . ."

"పిలిచాను. నాతప్పు లేదిక"

"ఆ, ఆ, యేం, యేం?"

"తొరగా వస్తే చద్దన్నం పెడతాను"

"రాకపోతే?"

"మీరు పెట్టుకోవాలి"

"ఇంతకంటే అదే నయం, వెళ్ళి నీ పని చూసుకో"

"కంచం కూడా మీరే కడిగేసుకుంటా రన్నమాట, అదే బాగుంది, మీపని మీరు చూసుకోండి"

"అదేమిటి?"

"మీ రిప్పుడు వెలగబెట్టేది మాత్రం యేమిటి?"

"చూడూ"

"చూశాను"

"చూ సేస్తే కాదు మరి"

"పోనీ, చూస్తున్నాను"

"నేనిప్ప డాక గొప్ప ఆలోచనలో వున్నాను"

"కనక?"

"నన్నిప్పుడు కదపకు"

"భోజనం కంటే మిక్కిలీ విలువ అయినదా అది?

"..............."

"కదిలితే పిట్ట అయి తుర్రు మని యెగిరిపోతుందా అది?"

"నీధోరణే నీదా? పోనీ, నువ్విప్ప డింత తొందర పెట్టడానిక్కారణం యేమిటో చెప్ప"

"పొయిలో నిప్ప పడేశాను. అది రాజిందంటే నీళ్ళు పోసుకుని పెద్ద మడి కట్టేసుకుంటాను. ఇక చద్దికుండ ముట్టుకోను. కంచం కేసి చూడ నైనా చూడను"

"అయితే, మధ్యాహ్నం భోజనా లయినాక యేకంగా కడిగేస్తువు గాని తొందరేం?"

"....ఇప్పుడు తిన్న కంచం అలాగే అట్టేపెట్టేసి, దాల్లోనే వడ్డిస్తాను మధ్యాహ్నం, అవును కంగారేం?"

"............ ..."

"బాగుందా?"

"నోరు ముయ్"

"నేను ముట్టుకోనండి"

"టాట్"

"అబ్బో, ఛరుడుపారానికే యింత యింగ్లీ షయితే, బి.ఏ. కావడం అంటూ వుంటే యిక భూమీ ఆకాశమూ కనపడక పోవునేమో?...."

"....గిల్లి కజ్జా పెడుతుంది భడవ. నాలుగు వాయిస్తే బుద్ధి వచ్చును గానీ—అయినా—యిక ముందు ప్రతీపనీ సకాలంలో చేసేసుకునే పద్ధతి యేర్పాటుచేసుకోవాలి మనం...,.. కాని తలుపులు బిగించుకుంది గదా యేమిటి

దారి? ఇటు వకడైన ఆలోచనా చెదిరిపోయి అటు చద్దన్నమూ లేక—ఛూ, ఇవాళ లేవగానే యెవళ్ళ మొగం చూశామో మనం?"

3

"ఏమిటి వంట యివాళ?"

"అన్నం వార్చాను"

"ఆధారం యేమి టని అడుగుతున్నాను"

"తవ్వేడు గిన్నండీ"

"..............."

"దాని కేమో పొయ్యి"

"..............."

"దానికి పుడకలూ పిడకలూను"

"..............."

"వాటి కేమో అగ్గిపుల్ల"

"మాట్లాడితే గరిగమ్మవాటం. సిగ్గు లేకపోతే సరీ"

"నా కెందు కుండాలీ సిగ్గు? మీరు తెచ్చి గుట్టలుపెట్టిన కూర లన్నీ కుళ్ళిపోతున్నా యనా?"

"పనిమనిషిని సంతకి పంపమని చెప్పలేదూ నేనూ?"

"మీరే వెళ్ళి తేవాలని వెంటనే చెప్పెయ్యలేదూ నేనూ?"

"సంతనుంచి కూరలు నేను మోసుకు రానా?"

"పొయిదగ్గిర పడివుండి వంట నేను స్వయంగా చెయ్యనా?"

"........"

"మీరు కడుపునిండా తిని గర్రున తేలుస్తూ లేచివెడితే విస్తరాకులు నాచేతులతో నేను తీసిపారెయ్యనా?"

"........"

"బిందె బుజాన పెట్టి చెరువునుంచి మంచినీళ్ళు నేను మోసుకురానా?"

"........"

"మానాయన వెయ్యిన్నూటపదహార్లు పారబోసి నాకు పెళ్ళి చేశాడు గదా, మీ చేతికి కాఫీకప్పు నే నందించనుటండీ?"

"........"

"ఇంతకీ: గుడి అరుగుమీద మీరు చీట్లపేకా, నాయిడు వాళ్ళని పది మందిని చేర్చుకుని రోడ్డుపక్కని నేను బాడ్మింటనూ ఆడుతూ వుంటే యెంత దర్జాగా వుంటుందో యెన్న డయినా ఆలోచించారా?"

"కదిపితే నువ్వు హద్దులో వుండవు, ఛా!"

"కదిపితే గాని మీరు హద్దులోకి రారు, సీత్"

4

"వంట అయింది"

"అయిందీ? మా ఆటకూడా అయిపోయిం దన్నమాటే. ఇక రెండెత్తుల్లో నువ్వు వద్దన ప్రయత్నంలో వుండవచ్చు."

* * *

"వంట అయింది"

"చెప్పావు. ఒక్క క్షణం ఆగు, ఈవెధవగుర్రం అడ్డు వచ్చింది గాని లేకపోతే యీపాటికి సగం భోజనం అయిపోయి వుండును"

* * *

"వంట అయింది"

"వినపడింది, జ్ఞాపకమూ వుంది. ఒక్క పది నిమిషాలు వోపికపట్టు. ఈలోపున నన్ను కంగారుపెట్టకు. ఇవాళ వీడి ఆట కట్టితీరాలి"

* * *

"వంట అయింది"

"వచ్చేస్తున్నా, నువ్విన్నిమాట్లు పిలవాలా? నా ఆకలి నే నెరగనూ? నాకు కసిపెరిగిపోయింది, ప్రపంచం తెలవడం లేదు. అదీ వున్న దల్లా, చెప్పకేం?"

* * *

"వంట అయింది"

"చెప్పానా? చూస్తున్నావా? కాస్తయినా యింగితజ్ఞానం వుండవద్దూ?"

* * *

"వంట అయింది"

"ఓహోహా, వేపుకుని తినేస్తున్నా వేమిటి మంచి రసకం దాయప్పట్టులో వచ్చీ? నీగో లే నీదా? మొగా డయినవాడికి లక్ష పను లుంటాయి వీధిలో, ఆడది వచ్చి యిన్నిమాట్లు పిలవనా భోజనాని కయితే మాత్రం?"

* * *

"ఎక్కడున్నావు?"

"కనపడదూ?"

"ఏమి చేస్తున్నావు?"

"కనపడదూ?"

మూతి బిడాయించుక్కూచున్నా వేం?"

"తెలియదూ?"

"అంటే?"

"గొప్ప ఆలోచనపరులు గదా యేలినవారు?"

"అయితే?"

"నేనూ గొప్ప ఆలోచనలో వున్నా నని తెలు[illegible]కోలేనప్పుడు—"

"ఇది ఆలోచిస్తూ కూచోడమూ?"

"కాక?"

"ఈవాలకం—"

"ఈవాలకాని కేం? బుర్రగోక్కుంటే గాని మొగరాజులకు ఆలోచన తట్టదు."

"మూతి బిడాయించుకుంటే గాని ఆడవాళ్ళకి ఆలోచన సాగదు, తెలుసా మరి?"

* * *

"గంటసేపణ్ణుంచి గుటకలు మింగుతూ కూచున్నాను, ఇంకా ఆలోచనేనా యేమిటి?"

"ఏమి చెయ్యమనీ మీ ఆలోచన?"

"వడ్డించ మని"

"ఓహో! అయితే, మడికట్టుకోకుండా మీరు వడ్డించమనడం యేమిటి?

"అదెంత సేపూ?"

"మన కేం దేవతార్చనా, సంధ్యావందన మయివానా, యిది మాత్రం యెంత సేపూ?"

"ఇదిగో........పట్టుపంచె........మరి లేవవేం?"

"మీరు స్నానం చెయ్యరేం?"

"శీతాకాలం, చలి వొణికించేస్తోంది, ఇవాళకి స్నానం చెయ్యను. పోనిద్దూ"

"కడుపునిండా అన్నం తిన్నా చలి వొణికించేస్తోంది, పోనిద్దురూ"

"రేపు తప్పకుండా చేస్తాను స్నానం, నీళ్ళు కాచు"

"అయితే, నీళ్ళపొయిలో నిప్పు పడేసివస్తాను, కూచోండి"

5

"వప్పేదీ?"

"కూరలో వుంది చూసుకోండి"

"దేని కదే వండితే యేమీ?"

"నిక్షేపం వంటి తాంబూలం పొగాకు కలిపి వేసుకునే యేలిన వారికి పప్పుకూర పనికివచ్చింది కాదేం?"

"నాఅలవాట్లివాళ మారేవి కావు. అలా బరిగిపోవలసిందే యిక"

"నేను వండింది వడ్డించాను. మీరు మారుమాట చెప్పకుండా తినివెళ్ళ వలసిందే"

* * *

"పులు సింత చిక్కగా కాచావేం?"

"అది పులు సయితేనా?"

"మరేమిటీ?"

"ధప్పళం కాదుటండీ?"

* * *

"అబ్బా. పెరుగు పులుపురొడ్డు. నాలుక చిల్లుపడి పోయిందిరా దేవుడా!"

"పోనీ, మజ్జిగ వడ్డించనా?"

"ఏదీ చూతాం"

"................"

"రామ రామా! చూరునీళ్ళు. చప్పగా వుంది"

"................"

"ఏమీ, నుంచున్నావేం?"

"ఏమి చెయ్య మంటారూ?"

"పాలు పట్టుకురా"

"వో, కావలసినన్ని"

"చూడూ, మహామంచిదానవు గానీ—కసింత పంచదార కలిపి—"

"నేనా పని చెయ్యను సుమండీ"

"అదేం?"

"తియ్యగా వుందనీ, మొగంమొత్తుతోం దనీ మళ్ళీ వంకలు పన్న డానికా? అబ్బో, వేషాలు నాదగ్గరా?"

6

"ప్రయాణం కామోసు"

"అన్నమాటే"

"వల్లకాదు"

"ఏదో పని కల్పిస్తావు, నాకు తెలుసు"

"కల్పించడం యెప్పుడో అయిపోయింది. ఇది పురమాయించడం"

"ఈపూటకి విడిచిపెట్టలేవూ?"

విడిచిపెట్టను. పొలమూరు వెళ్ళి మక్తాధాన్యమూ తోటశిస్తులూ పట్టుకు రావాలి"

"చంపేశావు"

"మరేం ఫరవాలేదు. వచ్చాక చీట్లాడితే సరీ మళ్ళీ బతకవచ్చు"

"..............."

"వెళ్ళితీరాలి"

"..............."

"ఈనెలరోజులూ కష్టపడితిరా, పదిపుట్ల ధాన్యమూ, వెయ్యి రూపాయలూ చేతికివస్తాయి. మళ్ళీ సంవత్సరం దాకా మీకు స్వేచ్ఛ. ఉందనీ లేదనీ చీకూ చింతా అక్కర్లేదు, రేకవేసి పుట్టుకువచ్చారు"

"..............."

"పచ్చకాగితం మారిస్తే నెలరోజులు గడవడం లేదు కొత్త శిస్తులు వస్తే గాని యిక అమావాస్య వెళ్ళదు. ఈ సంవత్సరం మీ పొగాకు కోసమే యాభయి రూపాయిలు—"

"అన్నట్టు పొగా కయిపోయింది. ఒక్క రూపాయి దయ చెయ్యాలి"

"ముందు పొలమూరు వెళ్ళివచ్చి, తరువాత అడగడం"

"ఇప్పుడే యిస్తే యేమీ?"

వచ్చాక యిస్తే మాత్రం యేమో?"

రైతు లిప్పుడు కనపడతారా-"

"ఏమీ కనపడకా?"

"పొలాలు వెళ్ళరూ?"

"మీరూ వెళ్ళండి, యేపొలం యేస్థితిలోవుందో చూసుకోవచ్చు కూడా"

"అబ్బా, అద్దెకు సైకిళ్ళిచ్చే షాపు లుండగా నడిచివెళ్ళమంటావు"

"మన స్నేహితుల్లో సైకిళ్ళున్నవాళ్ళు పదిమందిదాకా వున్నారు, వాళ్ళ కూడా కూడా మనం తిరగడమే గాని వొక్కడూ మనకి ఉపకారం చెయ్యడాయెమరి"

".........."

".........."

"పోనీ, నడిచే వెడతాను సరా?"

"నడిచి కాకపోతే యెగిరి వెళ్ళండి, యివరూ వద్దన్నారూ?"

"........."

"చెయ్యి చాపనక్కర లేదు. ఇస్తానంటే నే నివ్వడమే అయితే, తొరగా వెడితెనే రూపాయి. ఆలస్యం చేస్తే అర్ధ రూపాయే, వెడుతూ వెడుతూ యెక్కడయినా, చీట్లయినా చదరంగం అయినా ముట్టుకున్నారంటే మాత్రం, అమావాస్య వెళ్ళాకే యివ్వటం, తెలిసిందా?"

7

"స్, రామయ్యతండ్రి!"

"బాగుంది సుమండీ! ఏమహానుభావుడు నేర్పాడో గాని పుణ్యమూ పురుషార్థమూ కూడానూ"

"అది కాదు, వడగొట్టేసిం దన్నమాట"

"పుండు వంటి శీతాకాలం కాదూ మరీ? మీరు కనక నెగ్గుకువచ్చారు"

"చచ్చివస్తే—"

"వచ్చి బతికితే—"

"........."

"మీ ఆపసోపాలకేం గానీ, వసూళ్ళేమాత్రమో చెప్పండి తొరగా"

"కసిన్ని మంచినీళ్ళయినా యిస్తూ, ముందు"

"అయినా అంతే?"

"ఇలాంటప్పు డయినా వొక్క కప్పు కాఫీ—"

"నేను చెయ్యలేను సుమండీ"

"అదేం?"

"ఎండలో వెళ్ళినందుకు మీకు వడగొట్టింది, కుంపటి దగ్గిర కూచుంటే నాకు వడగొట్టదేం, పాపం?"

"ఏదో మెలికి లేకుండా మాట్లాడవు నువ్వు"

"మీరు మాట్లాడతారు మహా—వంకర లేకుండా"

".........."

".........."

"నన్ను విసిగించక నీకు తోచిన ధారకం యేదో వొకటి దయచెయ్యి"

"..............."

"మజ్జిగ తెచ్చావు"

"అవును"

"ఇందాకానే పులుపు చిచ్చు, ఈపాటికి బురబుర యెతే వుంటుంది"

"ఒక్క గుక్క చూసుకోరాదూ?"

"ఉప్పు కలిపి తెచ్చావా?"

"అబ్బే"

"మరేం చేశావూ?"

"నిమ్మకాయ పిడిశాను"

"..............."

"మూడు బొత్తులు, అరవై రూపాయిలు"

"..........."

"ఇది పచ్చకాగితం"

"..........."

"ఇవి అయిదు పదులు"

"..........."

"ఆరైదులు"

"..........."

"పది హేను రెళ్ళు"

"........."

"పది వొకట్లు"

"..............."

"రెండు వందల యెనబయ్యే తెచ్చారేం?"

"అరటితోట శిస్తు అంతేటగా?"

"మరి చెరుకుతోట శిస్తు?"

"అమావాస్య వెళ్ళగానే పట్టుకువస్తారు"

"ధాన్యం?"

"తెల్లవారాటప్పటికి వస్తాయి బళ్ళు"

"మీరు దీపాలు పెట్టాటప్పటికి ఇంటికి రండి, వెళ్ళండి"

"......."

"రూపాయి తీశా రెందుకూ?"

"ను వ్విస్తా నన్నదేగా?"

"అది మరుపు రాదు పాపం, ఇలా యివ్వండి"

"మాట తప్పుతావా?"

"ఇవ్వండి ముందు"

"........"

"వల్లకా దండి"

"నాచేతినుంచి నీచేతికీ, నీచేతినుంచి మళ్ళీ నాచేతికీ గుంట తిరుగు ళ్ళెందుకూ?"

"మాట్టాడవద్దు, ఇవ్వండి"

"అబ్బా, మరి పుచ్చుకో"

"ఇదిగో, పెట్టుకువెళ్ళండి"

"దానిని గ్గోసిన పట్టుదల గానీ—నీచేత్తో యివ్వాలనా?"

"కాకపోతే? చేతిలోది చేతిలోనుంచే యెగరవేద్దా మనుకున్నారా?"

8

"మమ్మల్ని దయతలచకూడదు సుమండీ"

"ఏమి అపరాధం చేశాన్తూ?"

"ఊరంతా తిరిగితేగాని దొరికారే కాదుట?"

"ఎందుకోసం?"

"అవునా కాదా?"

"ఇవాళ బడిసావడిలో వేళారు కుర్రవాళ్ళు మకాం"

"అయితే?"

"అంచేత నాకోసం వూరంతా తిరగవలసివచ్చి వుంటుంది?

"ఇప్పుడు నేను రావడానికి వీలులేదని కూడా అన్నారుట?"

"వీలంటే—"

"స్స్! నేనడిగింది వేరు"

"అన్నమాట నిజమే కానీ—"

"ఇక కానీ యెందుకూ? దయచెయ్యండి"

"దయచెయ్య మంటే రెండర్థాలున్నాయి, తెచ్చింది వెంటనే యిచ్చెయ్య మనీ, కూచో మనీ"

"ఇక నుంచోవద్దని మూడో అర్థం కూడా వుంది, తెలివి"

"అదే, చెప్పాగా? కూచోమని—"

"ఇక్కడ కాదండి, బడి సావట్లోనండి"

"రమ్మని కబురుచేశావు మరి?"

"రావడానికి వీలులేదని కసురుకున్నారు మరి?"

"నాది తప్పే, వొప్పుకున్నాను"

"ఇంటికి రావడం అంటే అంత కష్టం కాబోలు"

"ఏమేమిటో సెలవిప్పిస్తే—"

"సెలవిప్పిస్తే మాత్రం యింతకంటే మనకి సదసం వస్తుందాః"

"...................."

"ఎండపడి రావడమే కాకుండా, నోరు చేసుకుని అడిగారు కూడాను అని—"

"దయ వుందన్నమాటే"

"పోనీ అని చేసి యిస్తే మాత్రంః మళ్ళీ యెప్పటి ఆటే. చెయ్యికడుక్కోడం తరవాయి"

"ఏమయినా ఫలహారం చేశావా యేమిటోయ్ః"

"ఫలహారం కాదు, బండలు"

"ఏదీ, తొరగా పట్టుకురా"

"అవతల మించిపోతోందాః"

"మించిపోతోందా అంటే, వాయువేగమనోవేగాలమీదేః మహానిక్కచ్చిగా నడుస్తోంది దశావతారీ. అసలు, రావడానికే మనసొప్పింది కాదు గానీ—ఇక నువ్వు తరవాయి అట్టేపెట్టవని—"

"మీ కివ్వకుండా అంతా నేనే మింగేస్తా ననుకున్నారాః"

"...................."

"...................."

"ఓహో, కాఫీ చేశావాః దీనికి సాయం రెండు పకోడీలు కూడా వుంటేనాః"

"నోరూరుతోందాః"

"మెల్లిగా అడుగుతున్నావాః"

"తింటున్నట్టే వుంది కామోసు"

"ఉండదూ, చూపు దానిమీదికి పోతేనూః"

"ఇక చెయ్యడం యెందుకూ పనిచెడిః"

"....అబ్బా, ఉడుకూ మడుకూను. నాలుక చుర్రుమంది"

"చన్నీళ్ళలో పెట్టి చల్లారుస్తానిలా యివ్వండి గ్లాసు"

"ఊరికే మాటవరసకన్నాను గాని మన జిహ్వ కీ వేడి వాక లెక్కాః"

"అయితే, వొక్కమాటు కుంపటిమీద పెడతా, నివ్వండి"

"మంచిపనే గాని—కాఫీకారిక వొకటుంది విన్నావాః"

"ఏమిటో అదిః"

"కాఫీ వేడిగా వుంటే భరించలేం, వేడిగా లేకపోతే భరాయించలేం"

"సంధ్యావందనం రాకపోతే మానె, కాఫీకారిక లయినా రావద్దూ అవధానులవారి పుత్రరత్నంగారికీ?"

"...................."

"పోనీ, వెళ్ళండి, నాకేం?"

"ఇంకా యేదో తరవాయి అట్టేపెట్టావు, నాకు తెలుసు"

"ఏమయినా యిక మీరు నుంచోరు, నాకూ తెలుసు"

"అబ్బే, వెళ్ళను రా మరి"

"మీరిక్కడ ఆలస్యం చేసి వెళ్ళారంటే అక్కడ వాళ్ళు చేరనివ్వరు సుమండీ"

"వాళ్ళ మొగం! నా సరదాకొద్దీ నేను వెడుతున్నాను గానీ—వో—హో అదా? తాంబూలదానంబు తప్పక చేసిన—"

"ఆడా మొగా భేదం—"

"పద్యం దిద్దెయ్యనూ?........వా! తమలపాకులు కావివి, వెన్నప్పాలు"

"మరి పోకచెక్కలో?"

"కలకండ పలుకులే. అయితే, తాంబూలం కాగానే తరవాయి యేమిటో....?

"....దీని తరవాత....యేమిటో?"

"అంతే అంతే, ముక్తాయింపు బులబులాగ్గా తేలిపోవాలి— మరి సెలవ్!"

"దీల్లో మాత్రం పండితులే. ఇదిగో! దీపాలు పెట్టాటప్పటి కింటికి రావాలి, చెప్పాను కదా?

9

"అన్నకాడి కాలస్యం అయినట్టా. కానట్టా? అదిగో గుడి దగ్గిర తిరుగు తున్న మనుష్యులు కనపడుతూనే వున్నారు, వేళమించలేదన్నమాటే... అయితే, దీపాలు పెట్టడం అంటే పొద్దు గూకడమా, చీకటి పడ్డమా?.... అట్నుంచి నరుక్కువద్దాం...."

". . . . . ."

"వినపడలే దన్నమాట. కనక, మళ్ళీ....

"................"

"ఊహూ, గట్టిగా తట్టి చూద్దాం ..."

"......."

"తలుపు దగ్గిరే వుండి నన్నాడిస్తోందా, వంటింటోవుందా?.... ..."

"......."

"వంట యెప్పుడో అయిపోయి వుంటుంది, ఇదంతా నటనే, సందేహం లేదు. అబ్బో! నాదగ్గిరా వేషాలు"

"......"

"చిటపట చినుకులు, దుప్పటి తడిసెను,
తలుపు తియ్యవే భా-మా వేగ తలుపు తియ్యవే భా-మా"

"..............."

"ఇదిగో, ఇక్కడ నన్నింతసేపు నుంచోబెట్టి' ఆలస్యం అయిందని పేచీపెడితే నే నొపక్కో నే మనుకున్నావో గాని"

"....రేచీక టయినా పెట్టాడుకాదమ్మా దేవుడు"

"నాకళ్ళు పోవాలని వుందా?"

"అడిలిపోయి నేను మంచం పట్టాలని వుందా?"

"ఇంతట్లోకే?"

"క్షణం చాలు, భయపడడానికి"

"అయితే, రిస్టువాచీ కొనిపెట్టు, రేపణ్ణుంచి నువ్వు రమ్మన్న క్షణానికి వచ్చి వాలుతూ వుంటాను"

"అదేమంత భాగ్యం, ముందు బుద్ధి కొనుక్కురండి"

* * *

"పట్టుపంచె కట్టుకుని సిద్ధంగా వచ్చారు గాని, ఆకుల్లేవు వడ్డించడానికి"

"కంచం పెట్టు"

"చీకట్లో నేను కడగలేనండి"

చీకట్లో నేనూ ఆకులు కొయ్యలేనండి"

"మరి పగలస్తమానమూ యేమి చేశారూ?"

"ఇప్పుడు చెప్పిన మాట నువ్వప్పుడే యెందుకు చెప్పావు కాదూ?"

"ఇంటో యేమి వుందో యేమి లేదో మీరు కాస్త పరకాయించుకుంటూ వుండనక్కరలేదూ?"

"అదంతా నాకు తెలియదు. నువ్వు చెబితేనే చెయ్యడం నా పూచీ!"

"బాగుంది, ఆకులుంటేనే వడ్డించడం నాపూచీ మరి, తెలుసా?"

10

"అదృష్టవంతుడైన మొగవాడికి, భోజనం చేసి లేచాటప్పటికే తమల పాకులు చిలక లందించే పెళ్ళాం దొరుకుతుంది"

"పెట్టిపుట్టిన ఆడదానికి, తనతో కలిసే తాంబూలం వేసుకునే మొగుడు దొరుకుతాడు"

* * *

"నీభోజనం తెమిలాటప్పటికి వూరు మాటుమణిగింది. పక్క దులిపి బాగుచెయ్యాలి తొరగా, కళ్ళు మూసుకుపోతున్నాయి నాకు"

"అంత అతిశయం కూడదు సుమండీ సంసారికి"

* * *

"చలి వొణికించేస్తోంది, హు హు హు"

"శాలువుమీద రగ్గు కూడా కప్పనా?"

"అలా పోయేది కాదిది"

"కుంపటి యెత్తుతా నుండండి"

"పోనీ, నా కొక్కడికేనా యేమిటి?"

"ఆమాటమీద నిలవండి"

1931 జనవరి భారతినుంచి

పెంపకం